

# ఆకలి

ఉమ్మెంతల వెంకటరెడ్డి

పగలెల్లా నిప్పులుచెరిగి చల్లబడ్డ సాయంత్రం. దూరంగా వినిపిస్తున్న జాజిరి పాట. కాముణ్ని కీర్తిస్తున్న ఆడవాళ్ళ చప్పట్లు. కాముని పున్నమ రాబోతుంది. ఆకాశంలో తెల్లగా నవ్వుతున్న చంద్రుడు. నా ఆలోచనలు రేపు రాబోయే కామ దహనం గురించి నిండిపోయాయి.

"కొంచెం అన్నం వేయండమ్మా!" దీనంగా వినిపించిన గొంతు.

బయటికి వెళ్ళి చూచాను.

సొట్ట పోయిన అల్యూమినియం గిన్నె. చిరిగి పోయిన గుడ్డలు, రేగిన వెంట్రుకలు, లోపలికి పోయిన కండ్లు ఆ వెన్నెల్లో కూడా కనిపిస్తున్నాయి. ఆమెను చూడగానే దారిద్ర్యం నడుస్తుంది. బీదరికం అందాన్ని దోచుకున్న యువతి అనిపించింది.

"ఆకలేస్తుంది ఏదన్నా తింటానికి పెట్టు బాబూ."

"ఏం పెట్టను? నేనే హోటల్లో తింటాను."

ప్రేంకులో వున్న బన్ ఇస్తే బాగుండు నవిపించింది.

ఆమె కదలలేదు. నా వైపే చూస్తూవుంది. శిథిలమైపోయిన పూర్వపు సౌందర్యాన్ని చూపించే శిల్పంలాంటి అవయవసౌష్టవం. చిరిగిన చీరగుండా వెన్నెల్లో మెరుస్తున్న శరీరం.

నాకు జాలివేసింది. ఆమె చూపులు నాకుదీనంగా తాకుతున్నాయి.

"నా మొగుడు పట్నంలో చచ్చిపోయాడు. ఇద్దరి బిడ్డల తల్లిని. ఏదన్నా యింత పెడితే మీ పేరు చెప్పుకుని యీ రాత్రి గడుపుతాం"

వంటచేసుకున్నా బావుండేది. అయితేయేం బన్ యిచ్చేస్తాను. ఈ బన్‌తో ముగ్గురి ఆకలి తీరుతుందా? - ఆమెను చూస్తూనే ఆలోచిస్తున్నాను.

పోలీస్ ఠాణాలో ఎనిమిది గంటలు కొట్టారు.

ఆమె నా వైపే చూస్తోంది.

"చిమ్మే గొబ్బం పట్టినవాడే హోళీ" - చెమ్మ కేళిలా హోళీ.

దూరంగా గొంతెత్తి అరుస్తున్న ఆడవాళ్ళు - కామదహనం రాబోతుంది. కామున్ని చంపి ఆకలి తీర్చుకోటానికి ఆరాటపడుతున్నారు. మరి ఈమె అట్లా అడుక్కోవచ్చుగా?

"నా దగ్గర చిన్న బన్ వుంది. తెస్తానుండు" లోపలికెళ్ళి బన్ తీసుకొచ్చి ఆమె కిచ్చాను. ఆశగా నోట్లో పెట్టుకుంది. వెంటనే బయటికి తీసింది. ఆమె చూపులు ఎటో వెతుకుతున్నాయి.

"ఇంకేమన్నావుంటే యివ్వండి. పిల్లలున్నారు"

ఆమె చూపులు నా వైపు చూస్తున్నాయి

ఇవ్వగానే పోలేదేం? ఆకలి. ఆకలికోరకు అడుక్కుంటున్న యువతి లోకమంతా ఆకలి. కడుపాకలి. కోరికల ఆకలి నాకూ ఆకలి

నా ఆకలి తీర్చుకుంటే ఏం? - ఆమెను. చూశాను.

ఇంకా కదలడంలేదు.

రోడ్డుమీద జనంలేరు.

"నీమొగుడు నిజంగా చచ్చిపోయాడా?

"అవును బాబూ!"

"పట్నం ఎందుకు పోయాడు?"

"కూలికి."

"ఎన్నాళ్ళయింది చచ్చిపోయి?"

"చిన్నోడు పట్టినప్పుడు."

అయితే చాన్నాళ్ళయిందన్నమాట. మరి నిన్న మొన్ననో పోయినట్టు చెప్పిందే? ఆకలి -

ఇంకా కదలని ఆమె - కోర్కెలు ఎక్కువవుతున్న నేను.

"మరి ఎట్లా గడుపుతున్నావు?"

"ఇట్లాగే అడుక్కుంటూ."

"ఇట్లాగేనా?"

ఆమె తల వంచుకుంది. అంతే! ఆ రకం మనిషే. ఆకలికోరకు ఆకలితీర్చే మనిషే

"నీకు డబ్బు కావాలా? మా ఇంటి వెనుక గుండా రా"

ధైర్యం తెచ్చుకుని అన్నాను. అయినాగుండెలు వడిగా కొట్టుకుంటున్నాయి, ఆకలి కోర్కెల ఆకలి

ఆమె మళ్ళీ తలవంచుకుంది.

నాలో ఆశ యింకా ఎక్కువైంది.

"మా ఇంటి వెనుకకురా. చాలా డబ్బిస్తాను."

నా గొంతు వణుకుతోంది.

వద్దు. ఇక్కడొద్దు. ఊరు బయట కూలివ కొంపలో పిల్లలున్నారు. తొందరగా తిండి తెస్తానని వచ్చాను. వాళ్ళ ఆకలి తీర్చాలి.

"మరైతే అక్కడికి రానా" నా మనస్సులో కోర్కెలు పొంగుతున్నాయి.

"రండి" తలవంచుకుని నడుస్తూవెళ్ళిపోయింది.

నా గుండె లెగిరిపడుతున్నాయి, నరాలు జివ్వుమంటున్నాయి. గబగబా షర్టు వేసుకుని బదురూపాయలు తీసుకుని హోటల్ వైపు నడిచాను, నాలుగు రొట్టెలు పార్సెలు కట్టించుకుని ఊరి బయటికి నడిచాను.

గాలి వేగంగా నన్ను తాకుతోంది. ఆకాశంలో మబ్బులు తిరుగుతున్నాయి. గబగబా నడిచి కూలినల్లు చేరాను.

వీధిలైటు వెలుతురు మసకమసగ్గా ఆకూలిన యింటివరండాలో పడుతోంది. ఇలాంటి దిక్కులేని వారిని ఆదుకోడానికే అది అట్లా పడిపోయిందేమో? రోడ్డుమీద నిల్చుండి అటుచూశాను. ఆమె గోడ నానుకుని కూచుంది. రెండువైపులా యిద్దరుపిల్లలు ఆడమగ భేదం తెలియని ఆకారాలు. రోడ్డునిగ్గి ఆ యిల్లు చేరడానికి అడ్డువచ్చిన సంస్కారపుగొంతు నులిమే ఆకలి కోర్కెల ఆకలి-

మెల్లిగా ఆమె దగ్గరగా పోయాను పార్సిల్ అందించాను.

ఆత్రంగా తీసుకుంది. గబగబా విప్పింది. ఆ రొట్టెల్నిచూసి ఆ యిద్దరి పిల్లలు ఆనందంతో చప్పట్లు కొట్టారు. ఆమె రొట్టె లందియ్యగానే ఆత్రంగా ఆశగా యిదివరకెన్నడూ అవితిననట్టుగా గబగబా తినసాగారు ఆమెకూడా ఓరొట్టె అందుకుని గబగబా తింటోంది. తొందరగా తినకుంటే మళ్ళీ ఎవరన్నా ఎత్తుక పోతారో అన్నట్టుగా తింటున్నారు. ఆ సమయంలో వాళ్ళకు రొట్టెలుతప్ప ఏదీ కనిపించడంలేదు. నేనక్కడున్న విషయాన్నేమరిచిపోయారు.

దేశంమీద - ఆకలి తీర్చలేని లోకంమీద ఎక్కడలేని కోపం వచ్చింది. ఎంత ఆకలి! రొట్టెలుతిని ప్రక్కనేవున్న మట్టిముంతలోని నీళ్లు త్రాగారు. ఇందాకటి దీనమైన చూపు - ఆకలి చూపలేదు.

"అమ్మా! ఎవరేయీాయన?" ఓపిల్ల ప్రేమగా అడిగింది.

"మనకు తిండి పెట్టినదేవుడు ఆకలి తీర్చినవాడు" ఆపిల్ల తల నిమురుతూ నెమ్మదిగా చెప్పింది.

"తిండిపెట్టిన దేవుడు ఆకలి తీర్చినవాడు." నేను ఆకలి తీర్చాను నిజమే. మరి నాఆకలి? ఆ ఆకలి తీర్చుకోవద్దూ? ఆ ఆకలే తీర్చుకుంటే నేను పెట్టిన ఈ తిండికి ఇంత విలువుంటుందా? నే నాలోచనలోపడ్డాను.

ఆమె యిద్దర్ని తొందరగా పడుకోమంటోంది. నిద్రావశం లేదంటే గదమాయిస్తుంది. ఆ దృశ్యాన్ని చూచి నామీద నాకే అసహ్యం కలిగింది.

ఆమె వాళ్ళను కొట్టబోతూంది.

నా కళ్ళనిండా నీళ్లు తిరిగాయి.

"వాళ్ళను కొట్టొద్దు." రెండు చేతులెత్తి దండం పెడుతూ ప్రతిమిలాడాను.

వెనక్కితిరిగి గబగబా యింటివైపు నడిచాను.

★

